


# ఎదురు చూసిన క్షణం

జొన్నలగడ్డ శివప్రసాద్

కోరినదీ, ఆశించినదీ అంతా అబద్ధమే అయినా జీవితం మాత్రం అంతం కాదు, జీవితం జీవించడానికే అని మనిషికి గుణపాఠం నేర్పడానికా అన్నట్లు, అదొక నిర్వికార శూన్యస్థితి. ఆ శూన్యంలో నుంచి తిరిగి ఆశ జనిస్తుంది, చిత్రంగా. అది కూడా అంతరిస్తే మనిషి మనగలడా? ఏమో!

"అలా నీ చేతివేళ్లు వేగంగా వీణమీద కదలాడుతూ ఉంటే ఎలా ఉంటుందో తెలుసా, విశాలా"

"ఎలా ఉంటుంది, మాస్టారూ?"

"సాక్షాత్తూ సరస్వతీదేవి దిగివచ్చి వీణ మోగిస్తున్నట్లూ, అడ్డువచ్చిన రాళ్లను ఒరిపిడి చేసుకుంటూ గలగల శబ్దాలతో సెలయేరు ప్రవహిస్తున్నట్లూ, చిగుర్లు తిని మత్తెక్కిన కోకిల గొంతెత్తి పాడుతున్నట్లూ..." అరమోడ్పు కన్నులతో మైమరచి తనవంక చూస్తూ అనేవారు మాస్టారు. తాను పరవశించిపోయేది.

అయితే ఇప్పుడా మాస్టారక్కడ లేరు. తన్మయత్వంతో వీణమోగించే విశాలకూడా లేదు.

సెలయేటి గలగలలు పోయి, మైదానంలో ప్రవహించే గంభీరమైన నదిలాగా, ఎంతో అనుభవం గడించినదానిలాగా డాక్టర్ విశాలాక్షి కన్సల్టింగ్ రూములో కూర్చుని రోగులతో మాట్లాడుతూ వారి రోగాలకు తగిన మందు వ్రాసిస్తూ ఇప్పటికీ ఉంది. తనూ, తన హాస్పిటలూ, రోగులూ, వారి రోగాలూ-ఇవితప్ప విశాలకు ఈ విశాలప్రపంచంతో సంబంధం లేదు.

హాస్పిటలు పెట్టిన మొదట్లో ఆమెను గురించి నలుగురూ నాలుగువిధాలుగా చెప్పుకున్నారు. తెల్లని చీర, మెడలో స్టెతస్కోపు చూసి కొందరు రోగులు "ఆ తల్లి మా పాలిటి కామధేనువు. వెయ్యేళ్లు చల్లగా వర్ధిల్లాలి!" అనుకుంటే, అదే తెల్లచీర, బోసి మెడ చూసి, "మొగుడు చచ్చిన విధవ!" అని మరికొందరు అనుకున్నారు సానుభూతితో.

"కట్టుకున్నవాడు వదిలేశాడు!" అని మరికొందరు పుకారు పుట్టించారు.

కానీ, వారి దీవెనలూ, సానుభూతులూ, పుకార్లూ తన పని తాను చేసుకుపోయే విశాలమీద ఎటువంటి ప్రభావమూ చూపలేదు. ఎవరైనా ధైర్యం చేసి పై విషయాలు ప్రస్తావించినా సమాధానంగా చిన్న చిరునవ్వు నవ్వేది. ఆ చిరునవ్వు వెనుక ఆనందముందో, విషాదముందో ఎదుటివారికి తెలిసేది కాదు.

"డాక్టర్! రోడ్డుమీద పరధ్యానంగా నడుస్తూ కారుకింద పడి తలకు బలమైన గాయాలు తగిలితే తీసుకొచ్చి ఆపరేషన్ థియేటర్లో చేర్చారు ఒకతన్ని!" పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పిన నర్సు మాటలకు తుళ్లిపడింది ఏదో ఆలోచిస్తున్న విశాలాక్షి.

"పద, పద, వస్తున్నా! అన్నీ సిద్ధం చెయ్యి!" అంటూ లేచి ఆపరేషన్ థియేటరువైపు నడిచింది. దారికి అడ్డంగా వస్తున్న రోగులు పక్కకు తప్పుకున్నారు నమస్కారాలు పెడుతూ.

థియేటరు తలుపులు మూసుకున్నాయి. తలనిండా రక్తంతో గడ్డకట్టిన చారలతో స్పృహ లేకుండా ఒక పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు రోగి. నర్సు పరికరాలన్నిటితో సిద్ధంగా పక్కన నిలబడి ఉంది. గది లోపలి గోడకు తగిలించిన తన ఫొటోవంక చూసింది విశాల. 'నీ కర్తవ్యం నెరవేర్చు' అని ప్రబోధించేటట్టు స్థిరగంభీరముద్రతో తన ఫొటోలోని ఆకృతి తనను హెచ్చరిస్తోంది.

'భగవాన్! నీదే భారం!' అంటూ మనస్సులో తల్చుకుని చేతులకు గ్లవ్స్ తొడిగింది.

గది బయట బల్లమీద కూర్చున్న కొందరు విసుగ్గా కదిలారు. గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. రోగులను పరామర్శించే బంధువులు వచ్చి ఆదరాబాదరాగా అటూ ఇటూ వెళ్తున్నారు.

ఆపరేషను గది తలుపులు తెరుచుకున్నాయి. చిరుచెమటలు పట్టిన ముఖంతో విశాలాక్షి బయటకు వచ్చింది.

"నర్స్! అతనికి స్పృహ వస్తే గ్లూకోజ్ వాటరివ్వు. ఆట్టే అతనితో మాట్లాడకు. విశ్రాంతి తీసుకోనీ!"

"అలాగే, డాక్టర్!"

చేతులకు ఉన్న గ్లవ్స్ తీయకుండానే కన్సల్టింగ్ రూమ్‌వైపు నడిచింది. కాంపౌండరు ఒకరి తరువాత ఒకరిని లోపలకు పంపుతున్నాడు. కాస్సేపట్లో నడవా అంతా ఖాళీ అయింది.

"ఆంజనేయులూ! మరెవరైనా వస్తే కాస్సేపు కూర్చోమను. నాకు కొంచెం పనుంది!" ఆంజనేయులు తల ఊపాడు.

పైన సీలింగ్ ఫాన్ గిరగిర తిరుగుతోంది. టేబుల్ మీద ఉన్న కాగితాలు కదలలేక అక్కడే ఉండి టపటప కొట్టుకుంటున్నాయి.

శూన్యంలోకి చూస్తున్న చూపులు మరల్చి డ్రాయరు సొరుగులోంచి డైరీ తీసింది. అందులో భద్రంగా దాచిన ఫొటోవంక తదేకంగా చూసింది.

"అలా నీ చేతివేళ్లు వేగంగా వీణమీద..." మాస్టారు తనవంక నవ్వుతూ చూస్తున్నారు.

చేతి వేళ్లవంక చూసుకుంది విశాల. ఆ సున్నితపువేళ్లు కావివి. చకచకమంటూ కత్తులకూ, నరాలకూ మధ్య కదలాడే మొద్దువారిన వేళ్లివి. బాధగా నిట్టూర్చింది. పాతవిషయాలు మనస్సులో జోరీగల్లాగా మూగసాగాయి.

***

"అమ్మా, విశాలా! సంగీతం మాస్టారు వచ్చారు, చూడమ్మా!" తండ్రి కేక మేడమీద రేడియో ట్యూన్ చేసి వింటున్న విశాలకు చిరాకు పుట్టించింది.

"నాకీ సంగీతం వద్దు, మాస్టార్లు అంతకన్నా వద్దు! ఎన్నిమార్లు చెప్పాలి, నాన్నా నీకు?" విసురుగా మేడమెట్లు దిగింది.

తాననుకున్నట్లు నెరిసినజుట్టూ, ధోవతీ కాకుండా తెల్లని పాంటులో, అదే రంగు చొక్కా టక్ చేసి పొడుగ్గా, సూర్యకిరణంలాగా కనిపించేసరికి బిత్తరపోయింది.

'సంగీతం ఇంత బాగుంటుందా' అనుకుని, "మీ ఇష్టం, నాన్నా!" అన్నది తండ్రి మాటకు ఎదురుచెప్పడం ఇష్టం లేనిదానిలా.

ఆరు నెలలు కాలగర్భంలో కలిసిపోయాయి. మొదట్లో అభ్యాసం లేక వీణమీద వాయించే శ్రుతులు చూసి నవ్వేశారు మాస్టారు. తాను చిన్నబుచ్చుకునేది. అది చూసి మరీ నవ్వేవాడు హాయిగా, వెన్నెలలాగా.

కానీ, ఆ తరువాత తన వీణాపాండిత్యం చూసి ఎంత మెచ్చుకునేవారు! తన హృదయంలో అనురాగం చిందులాడేటట్లు, ఎదలో ఎవరో తీయగా పాడినట్లు, సెలయేరు గలగల పారినట్లు-ఎంత బాగుండేది ఆయన తన్మయత్వంతో తనవంక చూస్తూంటే!

ఎంతకూ హోమ్‌వర్క్ ఇచ్చిన లెక్కకు జవాబు తెలియక చిరాకు పడుతుంటే ఆ లెక్క చేసి చూపించారు మాస్టారు ఒకసారి. విస్ఫారితనయనాలతో ఆశ్చర్యంగా అడిగింది: "మీరెంతవరకు చదువుకున్నారు, మాస్టారూ?"



దీపావళి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 16.11.1966 సంచికలో ప్రచురించాము

మాస్టారి ముఖంలో నిస్పృహ ఆవరించింది. విచారరేఖలు ఆయన ముఖంనిండా పులుముకున్నాయి.

"ఎంతవరకు చదువుకుంటే ఏం లాభంలే, విశాలా ఈ రోజుల్లో?" బాధగా ఆయన అంటుంటే ఈ ప్రసక్తి ఎందుకు తెచ్చానా అని బాధపడింది.

"డాక్టర్! అతనికి స్పృహ వచ్చింది. గ్లూకోజ్ వాటరిచ్చాను!" నర్సు వచ్చి ఏకధాటిగా చెప్పుకుపోతుంటే విశాలాక్షి ఆలోచనలకు అంతరాయం కలిగింది.

విసుగుతో అంది-"చూడు, అతనేదైనా మాట్లాడటానికి ప్రయత్నిస్తే అదేపనిగా మాట్లాడకు. బాగా విశ్రాంతి ముఖ్యం!"

నర్సు తల ఊపి వెళ్లిపోయింది.

ఫొటోలోని మాస్టారు ముఖం విచారంగా తనవంక చూస్తోంది. ఆ నాడు వెళ్లిపోయేటప్పటి విచారపుచూపులే!

"చూడమ్మా! ఆ ఏలూరువారి సంబంధం ఖాయపరిచాను. నీవిష్టపడతావనే మాటిచ్చాను!" తండ్రి సంబంధం తాలూకు వివరాలు చెబుతుంటే గుండెల్లో రాయిపడ్డది. తన ఆశాసౌధం కూలిపోవలసిందేనా? వీల్లేదు, ఎంత మాత్రం వీల్లేదు! ముందు కాస్త తటపటాయించినా మెల్లగా మనస్సులోని మాట బయటపెట్టింది.

తండ్రి భగ్గుమన్నాడు. ముక్కుపుటాలు ఎగరవేశాడు. "అతనికి అంతస్తా? ఆస్తా?" ఇదీ ఆయన వితండవాదం. ఏది ఏమైనా తల్లిలా పెంచిన తండ్రి ఈ విషయంలో మొండి పట్టుదల చూపాడు. కన్నీళ్ల మధ్య తనకు వివాహమైంది. పెళ్లికి నాలుగు రోజులు ముందుగా మాస్టారు వచ్చారు. పైకి కన్నీళ్లు లేకున్నా విషాదం పులుముకున్న తన ముఖాన్నెలా దాచగలడు?

"విశాలా...!" ఆయన కంఠం జీరవోయింది. ఏనాడూ రాని అపశ్రుతులు ఆయన కంఠంనుండి వెలువడుతున్నాయి.

పాంటు జేబులోనుండి ఒక చేతి గడియారం పైకి తీశాడు. మౌనంగా చేయి ముందుకు చాపింది. చేతికి పెడుతూ, "ఇది నీ వివాహకానుక. నన్ను మరిచిపోయినా ఈ కానుకను మరిచిపోకు!" అన్నాడు. తనకు కన్నీళ్లు ఆగలేదు. ఏ కళనున్నాడో తండ్రి మాట్లాడలేదు చూసికూడా.

"వస్తాను, విశాలా! ఈ ప్రపంచంలో ఏ క్షణాన ఎక్కడ ఉంటానో నాకు తెలియదు!" భారంగా అతని అడుగులు ఆవరణ బయటకు దారితీశాయి. అపశ్రుతులు పడుతున్న అతని అడుగులు తడబడ్డాయి. కన్నీటితో అలా చూస్తూ నిలబడ్డది తాను. చేతికున్న గడియారం

వెక్కిరిస్తోంది.

వివాహమైన ఏడాది తిరగకుండానే తండ్రి మంచానపడ్డాడు. "భగవంతుడు నిన్నన్యాయం చేశాడు, తల్లీ!" అంటూ ఆయన వాపోతుంటే తనేమీ చేయలేని నిస్సహాయస్థితిలో నిలబడింది. కారు ఏక్సిడెంటులో తన నుదుటి కుంకుమ చెరిగిపోయింది. మిగిలిన బతుకంతా చీకటికాక ఏం మిగిలింది?

"బాధపడకు, నాన్నా! మెడిసిన్ మిగిలిన రెండు సంవత్సరాలూ పూర్తిచేస్తాను!" తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో అంది. ఆయన కన్ను మూశాడు.

లోకులు వేలెత్తి చూపుతూ నవ్వుతుంటే భరించలేక మద్రాసు వెళ్లి ప్రాక్టీసు పెట్టింది.

"మాస్టారూ! ఎప్పటికైనా మీరు వస్తారనే ఆశ ఏమూలో మినుకుమినుకు మంటోంది!" విశాల చెంపలమీద జాలువారిన కన్నీళ్లు తుడుచుకుంది. ఫొటో తీసి డైరీలో దాచి డ్రాయరు సొరుగులో ఉంచింది.

"ఆంజనేయులూ! వాళ్లను లోపలకు పంపించు!" బయట బల్లలమీద కూర్చున్న రోగులకు చైతన్యం కలిగింది. ఒక్కొక్కరే లోపలకు వెళ్తున్నారు.

***

అతడు కళ్లు తెరిచాడు. గ్లూకోజ్ వాటర్ తగిన నోరు అదోలా ఉంది. లేవటానికి ప్రయత్నించాడు.

"లేవకండి, పడుకోండి!" నర్సు అంది.

"నేనిప్పుడెక్కడున్నాను?" నీరసంగా అన్నాడు.

"హాస్పిటల్లో."

"అబ్బ!" నుదురు పట్టుకున్నాడు. ఏం జరిగిందో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. తాను రోడ్డుమీద నడుస్తున్నాడు ఏవో పాతసంగతులు నెమరువేసుకుంటూ. ఇన్నాళ్లూ తాను అర్థంపర్థం లేకుండా పిచ్చివాడిలాగా ఊళ్లుపట్టుకు తిరిగాడు. ఇకపైనా అంతే. పిచ్చిగా నవ్వుకున్నాడు నడిరోడ్డు మీద బీటు కానిస్టేబులు తెల్లబోయి చూస్తుంటే.

రోడ్డుమీద సైకిళ్లూ, కార్లూ అతని మనస్సులోని ఆలోచనలలాగే పరుగెడుతున్నాయి. రోడ్డుపక్కనున్న సిగరెట్టు షాపువద్ద ఆగాడు. సిగరెట్టు కొని ముట్టించి దట్టంగా పొగ వదిలాడు. మేఘాలు మేఘాలుగా వెళ్లే పొగలోంచి విశాల తనవంక చూసి మాయమైంది. తన జీవితంలోంచి రెండు సంవత్సరాల క్రిందే మాయమైంది.

అవతల వివాహం జరుగుతుంటే తాను నిస్సహాయస్థితిలో ఉన్నాడు. పెళ్లి భజంత్రీలు చెవులకు కఠోరంగా వినిపించాయి, తన చేతకానితనాన్ని పరిహసిస్తూ.

తనలాంటి అప్రయోజకుడిని కట్టుకుని బాధపడే కన్నా, ఐశ్వర్యంలోకి అడుగుపెట్టి సుఖపడితేనే మంచిదని వెర్రిగా సమాధానపడ్డాడు. అయినా, తను కోరేది ఒక్కటే. తానిచ్చిన బహుమతి గడియారాన్ని చేతికి పెట్టుకుని ఉంటే చాలు, అంతకన్నా, తాను కోరేది ఏమీ ఉండదు.

అతని ఆలోచనలు బలవంతంగా ఆగిపోయాయి. వేయి సుత్తులతో తన తలమీద ఎవరో కొట్టినట్లయింది. స్పృహ కోల్పోయాడు. అంతా చీకటి. అంతే!

***

"ఆంజనేయులూ! ఒకసారి నేను ఆపరేషను గదికి వెళ్లివస్తాను. ఎవరైనా వస్తే వెయిట్ చేయమను!"

"అలాగేనమ్మగారూ!"

రోగులు పక్కకు తప్పుకున్నారు. నడుస్తూ విశాలాక్షి ఎదురుగా ఉన్న గోడ గడియారం వంక చూసింది. ఒంటిగంటన్నర అయింది. విశాలాక్షి బాధగా నిట్టూర్చింది. గ్లోవ్స్‌మీద తడిమింది.

తనకు ఆ తరువాత తెలిసింది, మాస్టారు వీణ అమ్మేసి గడియారం కొన్నారని. 'మాస్టారూ! వీణనే అమ్ముకున్నారా!' తన హృదయం బాధతో మూలిగింది.

ఆపరేషను గదిలో నర్సు ఏదో మందు సిరంజిలోకి ఎక్కిస్తోంది.

"రోగి పరిస్థితి ఎలా ఉంది?"

"బాగానే ఉంది, డాక్టర్! ఇంతకు ముందే నిద్ర లేచి ఏదో మాట్లాడబోతుంటే వారించాను. ఎదురుగా ఉన్న మీ ఫొటో చూసి ఆశ్చర్యపోయి ఎవరిదన్నాడు. మీ గాయాలకు కట్లుకట్టిన డాక్టరు గారిదన్నాను. అతనింకా ఏదో చెప్పబోతుంటే వారించాను."

"వింతగా ఉందే!" రోగి ముఖంలోకి పరీక్షగా చూసిన విశాలాక్షి విస్తుపోయింది. "మాస్టారూ!" అస్పష్టంగా గొణుక్కుంది.

నర్సు వింతగా చూసింది.

విశాలాక్షి చెంపలమీద కన్నీళ్లు జాలువారాయి. రోగి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

"ఆ చేతివేళ్లు అలా వేగంగా వీణమీద ..." పదేపదే ఆ మాటలు ఆమె చెవులలో హోరుమన్నాయి.

"ఆ సున్నితపువేళ్లు కావు, మాస్టారూ, ఇవి! నిర్దాక్షిణ్యంగా మీ తలలోని నరాలు కత్తులతో కోసిన కసాయి వేళ్లివి!" రుద్ధకంఠంతో గొణుక్కుంది. "నా ఈ తెచ్చిపెట్టుకున్న గాంభీర్యానికీ, ఉదాసీనతకూ ఇంక చోటు లేదు, మాస్టారూ! ఎప్పటిలా చిందులాడే నవ్వుతో మీకు ఎదురుగా నిలబడగలిగే అదృష్టం కలిగింది. ఇన్నాళ్లకు నా హృదయవీణ మోగుతున్నది, మాస్టారూ! చిగుర్లు తిని మత్తెక్కిన కోకిల పాడినట్లూ, రాళ్లను ఒరిపిడి చేసుకుంటూ సెలయేరు నా హృదయంలో పరుగులు తీసినట్లూ ఇన్నాళ్లకు నాకు అనుభూతి కలిగింది, మాస్టారూ...!"

రోగి నెమ్మదిగా కళ్లు తెరిచాడు. విశాల తన చేతికి ఉన్న గ్లోవ్స్ వంక చూసుకుంది.

"ఇకపై ఈ చేతులతోనే వీణ వాయిస్తాను, మాస్టారూ! ఈ క్షణం కోసమే ఎదురు చూస్తున్నా...!" నెమ్మదిగా గ్లోవ్స్ తొలగించింది. ఆమె చేతికి ఉన్న గడియారం అతని కళ్లకు కనిపించింది.

అదే క్షణంకోసం ఎదు చూసిన అతని కళ్లు తృప్తితో శాశ్వతంగా మూతపడ్డాయి.

■



"మా ఆవిడ రాత్రంతా మేల్కొని ఉంటోంది. పెందరాడే నిద్రపోవడానికి ఏదైనా మాత్రలు రాసిస్తారా?" అడిగాడు గోవిందం.

"రాత్రంతా ఏంచేస్తుంటుంది మీ ఆవిడ?" ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్.

"నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది." తూలుతూ చెప్పాడు పేకాట అలవాటున్న గోవిందం.

- కలవత్తి సత్యం, ఏలూరు